సాక్షి చిత్తూరు

శుక్రవారం । 12 । సెప్టెంబర్ । 2025



వేవేల దండాలు తల్లీ.. పోలేరమ్మా

కోరిన కోర్కెలు తీర్చే పోలేరమ్మా అంటూ భక్త జనం ప్రణమిల్లారు. అమ్మవారి నామస్మరణ తో వెంకటగిరి వీధులు ప్రతిధ్వనించాయి. - 8లో



గజరాజుల బీభత్సం

ఆవులపెద్దిరెడ్డిగారిపల్లెలో ఏనుగుల గుంపు వంట పొలాలపై పడి పంటలను ధ్వంసం చేశాయి. - 8లో



వైభవంగా కలశ ఊరేగింపు

కాణిపాకం వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం కలశాలతో భారీ ఊరేగింపు నిర్వహించారు. - 8లో

న్యూస్‌రీల్

నియామకం

చిత్తూరు కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ విభాగ సంయుక్త కార్యదర్శిగా శ్రీకాళహస్తి నియోజకవర్గానికి చెందిన టీ.వెంకటేష్‌ను నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటించింది. పార్టీ బలోపేతానికి కృషి చేయనున్నట్టు ఆయన పేర్కొన్నారు.

ఆభా ఐడీ విధిగా నమోదు చేయాలి



మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ సుధారాణి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ఆభా (ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్) ఐడీని విధిగా నమోదు చేయాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ సుధారాణి ఆదేశించారు. చిత్తూరు నగరంలోని తన కార్యాలయంలో గురువారం డాక్టర్లు, స్టాఫ్‌నర్సులు, ఫార్మసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లకు డిజిటల్ మిషన్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆభా ఐడీ ప్రతి ఒక్కరికీ నమోదు చేయించాలన్నారు. తద్వారా వైద్య సేవలు ఆన్‌లైన్‌లో పొందుపరుస్తారన్నారు. ప్రస్తుతం కుప్పంలో నర్వ్ సెంటర్ నడుస్తోందన్నారు. అలాగే చిత్తూరులో కూడా సెంటర్ ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఆభా ఐడీ నమోదులో అలసత్వం వద్దని సూచించారు. కార్యక్రమంలో డీపీఎంఓ ప్రవీణ, వైద్యులు అనూష, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న శోభాయాత్ర



పుంగనూరులో స్వామి వారి శోభాయాత్ర

పుంగనూరు : హరిహరపురం మఠాధిపతి శ్రీ స్వయం ప్రకాశ సచ్చిదానంద సరస్వతి మహాస్వామి వారిచే పట్టణంలో తొలిసారిగా హిందూ శోభాయాత్ర నిర్వహించారు. గురువారం సాయంత్రం ఆయన పుంగనూరు చేరుకున్నారు. ఈ సందర్భంగా బ్రహ్మణ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో హిందువులు ఏకమై స్వామి వారికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్వామి వారు శ్రీచక్రనవారణ పూజా కార్యక్రమాలు సాయంత్రం నిర్వహించి, భక్తులకు ఉపదేశం ఇచ్చారు. హిందువులు ఐకమత్యంతో ఉండాలని, శాంతి భావాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.


రేపు జాతీయ లోక్ అదాలత్

చిత్తూరు అర్బన్ : జిల్లా వ్యాప్తంగా ఈనెల 13వ తేదీన జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారిక ఒక ప్రకటనలో తెలిపారు. న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారమే లక్ష్యంగా అదాలత్ నిర్వహిస్తున్నామన్నారు. రాజీ చేసుకోదగ్గ కేసులను అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని.. వివరాలకు చిత్తూరు కోర్టులోని జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో సంప్రదించాలన్నారు.

15 నుంచి ఇంటర్ త్రైమాసిక పరీక్షలు

చిత్తూరు కలెక్టరేట్ : ఇంటర్మీడియట్ త్రైమాసిక పరీక్షలు ఈనెల 15 నుంచి 20వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు పీసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ అబ్దుల్ మజీద్ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర విద్యాశాఖ అధికారుల నియమ, నిబంధనల మేరకు క్వార్టర్లీ పరీక్షలు నిర్వహించేందుకు కసరత్తు చేస్తున్నామన్నారు. ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల ఫీజు చెల్లింపునకు ఉత్తర్వులు అందాయన్నారు. ఎలాంటి అపరాధ రుసుం లేకుండా విద్యార్థులు ఈనెల 15 నుంచి అక్టోబర్ 10 లోపు ఫీజు చెల్లించేందుకు అవకాశం కల్పించారని ప్రిన్సిపల్ వెల్లడించారు.

డిమాండ్ల పరిష్కారానికి నిరసనలు



నిరసన కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : కూటమి ప్రభుత్వం టీచర్ల డిమాండ్లను పరిష్కరించి, ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలంటూ ఏపీటీఎఫ్ జిల్లా నాయకులు నిరసనలు చేపట్టారు. ఆ సంఘ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా వ్యాప్తంగా పాఠశాల స్థాయిల్లో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసనలు నిర్వహించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు జగదీష్, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలు వెంటనే విడుదల చేయాలన్నారు. తమ నిరసనలు ఈ నెల 17 వరకు కొనసాగుతాయని వెల్లడించారు.



పత్రికల గొంతునొక్కేందుకే తప్పుడు కేసులు



వార్తలు రాస్తే కేసులు పెడతారా? ప్రజాస్వామ్యం ఎక్కడ ఉంది ? తప్పుడు కేసులు నమోదుకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. సాక్షి పత్రికలో ప్రెస్‌మీట్లు, స్టేట్‌మెంట్లు ప్రచురించినందుకు పత్రికపైన , ఎడిటర్‌పైన , సంబంధిత రిపోర్టర్లపైన కూటమి ప్రభుత్వం నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేయించడం, కార్యాలయాలు, ఇళ్లు సోదాలు చేయడం దుర్మార్గం. పత్రికల గొంతునొక్కేందుకు తప్పుడు కేసులు నమోదు చేసి, భయభ్రాంతులకు గురిచేయడం వికృతచేష్టలకు నిదర్శనం. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా , ఆ తప్పులను ఎత్తి చూపుతున్న సాక్షిపై ప్రభుత్వం క్షక్ష సాధిస్తోంది. – మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

ప్రభుత్వం కక్ష సాధింపు



జర్నలిజం ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభం. స్వేచ్ఛ, వాక్ స్వాతంత్ర్యానికి భారతదేశం బలమైన రాజ్యాంగ రక్షణ కల్పించింది. అయితే కూటమి ప్రభుత్వం వాటిని కాలరాసే ప్రయత్నం చేస్తోంది. పత్రికలు, జర్నలిస్టులపైన కేసులు పెట్టడం పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు వేయడమే. స్టేట్‌మెంట్లు ఇచ్చినా కేసులు పెడతారా? ఇలాంటివి ఎప్పుడూ జరగలేదు. వాస్తవాలు భయటపెట్టే పత్రికలపై కేసులు పెట్టడం మాని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంపై కూటమి ప్రభుత్వం దృష్టి సారిస్తే బాగుంటుంది. – ఆర్కే రోజా, మాజీ మంత్రి

ప్రభుత్వ వైఫల్యాన్ని ప్రశ్నిస్తే కేసులా?



ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారు. ఎక్కడ చూసినా, మట్టి, ఇసుక, గ్రానైట్ వంటి ప్రకృతి సంపదను దోచుకుంటున్న పచ్చనేతలను ప్రశ్నిస్తే కేసులు పెట్టడమేనా ప్రజాస్వామ్యం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజల వాక్ స్వాతంత్ర్యాన్ని అణగదొక్కుతోంది. నిజాలను వెలికితీసే పత్రికలపైనా కేసులు పెట్టడం ప్రజాస్వామ్యాన్ని అవహేళన చేయడమే.. రాష్ట్రంలో అంబేడ్కర్ రాజ్యాంగం అమలు కావడంలేదు. కేవలం రెడ్‌బుక్ రాజ్యాంగమే అమలవుతోంది. పత్రికల గొంతునొక్కి, జర్నలిస్టులను మానసికంగా ఇబ్బంది పెట్టి , భయపెట్టేందుకే ఇలాంటి చేతగాని రాజకీయాలు చేస్తున్నారు. నిజాలను ప్రచురించే పత్రికలపై కేసులు పెట్టడం దుర్మార్గం. – కళత్తూరు నారాయణస్వామి, మాజీ ఉప ముఖ్యమంత్రి

అనుమతిలేని కాలేజీలు



జిల్లాలో ప్రైవేటు కళాశాలలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. అనుమతి ఒకచోట తీసుకొని.. చదువు ఒక చోట ..నిర్వహణ మరోచోట చేస్తూ కొన్ని ప్రైవేటు కళాశాలలు విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్నాయి. ఆకర్షణీయమైన బ్రోచర్లతో తల్లిదండ్రులను బురిడీ కొట్టించి ఫీజుల దోపిడీకి తెరతీస్తున్నాయి. కానీ ప్రభుత్వం విధించిన నిబంధనలు లేకుండా కళాశాలలు ఇష్టారాజ్యంగా నిర్వహిస్తున్నారు. వీటిని పర్యవేక్షించాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారనే విమర్శలు గుప్పుమంటున్నాయి. ఈ వ్యవహారంపై ఫిర్యాదు చేసినా చర్యలకు వెనుకాడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

ఇంటర్ విద్య.. అనుమతి మిథ్య

- ఒకటే అనుమతి.. కాలేజీలు అనేకం
- జిల్లాలో పుట్టగొడుగుల్లా అనుమతులు లేని ప్రైవేట్ కళాశాలలు
- ఇంటర్మీడియట్ ఉన్నతాధికారులు కళ్లు గప్పి నిర్వహణ
- అనుమతులు ఒకచోట.. నిర్వహణ మరొకచోట
- విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం
- పట్టించుకోని ఉన్నతాధికారులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో అధికారికంగా 64 ప్రైవేట్, కార్పొరేట్ జూనియర్ కళాశాలలున్నాయి. అనధికారికంగా మరో 15 కళాశాలలు నిర్వహిస్తున్నారని సమాచారం. ప్రైవేట్ కళాశాలలు ఇష్టానుసారం అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నారు. కొన్ని కళాశాలలకు అనుమతులు ఒక చోట పొంది మరొక చోట తరగతులు చెబుతున్నారు. అలాగే అనుమతి ఒక కళాశాలకు పొంది రెండు, మూడు బ్రాంచ్‌లు నిర్వహిస్తున్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా ఈ తతంగం సాగుతున్న విషయం ఇంటర్మీడియట్ అధికారులకు తెలిసినప్పటికీ ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. తమకేమి సంబంధం లేదన్న ధోరణిలో ఇంటర్మీడియట్ అధికారులు వ్యవహరిస్తుండడం విమర్శలకు తావిస్తోంది. ఫలితంగా అనుమతి లేని ప్రైవేట్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోంది.

అనుమతికి ఒక్క దానికే ఉన్నా...

జిల్లా కేంద్రంలో అధికార పార్టీకి చెందిన కార్పొరేట్ కళాశాల మొదటి బ్రాంచ్ కొత్త బస్టాండ్ వద్ద ఉంది. అనుమతులు సైతం ఆ బ్రాంచ్ కే ఉన్నాయి. అయితే అదే కార్పొరేట్ సంస్థకు చెందిన పాఠశాలను నూతనంగా ప్రభుత్వ ఐటీఐ కళాశాలకు దగ్గరలో ఏర్పాటు చేశారు. పాఠశాల నిర్వహిస్తున్న భవనంలో అధికార పార్టీ అండదండలతో జూనియర్ కళాశాల తరగతులు నిర్వహిస్తున్నారు. జూనియర్ కళాశాలకు అనుమతి లేకున్నప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా తరగతులు చెబుతున్నారు. అయితే ఇంటర్మీడియట్ అధికారులు మాత్రం చూసీ చూడనట్టుగా వ్యవహరిస్తున్నారు. అదే సామాన్యమైన నిర్వాహకుడి ప్రైవేట్ జూనియర్ కళాశాలలో తప్పిదాలు ఉంటే మాత్రం ఫైన్‌లు, సీజ్ చేయడం వంటివి చేస్తున్నారని ఇంటర్మీడియట్ అధికారులు తీరుపై విమర్శలు వెలువెత్తుతున్నాయి.

జిల్లాలోని పలమనేరు, కుప్పం, నగరి, పెనుమూరు, శాంతిపురం, వి.కోట, పుంగనూరు, చిత్తూరులలో పలు ప్రైవేట్ కళాశాలలు అనుమతులు ఒక కళాశాలకు పొంది రెండు, మూడు బ్రాంచ్‌లు నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నారు. చర్యలు చేపట్టాల్సిన జిల్లా ఇంటర్మీడియట్ అధికారులు ఏమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు.





జిల్లా కేంద్రంలోని పాఠశాల భవనంలో ఇంటర్మీడియట్ కళాశాల తరగతులు నిర్వహిస్తున్న అధికార పార్టీ మంత్రి కళాశాల

మైదానం లేని కళాశాలలు అనేకం

జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో 5 శాతం సైతం గ్రౌండ్ (క్రీడా మైదానం) లేని దుస్థితి. అయినప్పటికీ కళాశాలలు నిర్వహిస్తున్నారు. నిబంధనల మేరకు పురపాలక పరిధిలో రెండు ఎకరాలు, కార్పొరేషన్ పరిధిలో ఒక ఎకరా కనీసం ప్లే గ్రౌండ్ చూపించాలి. ఆ స్థాయి స్థలం విలువ లక్షలు, కోట్లల్లో ఉండేటప్పటికీ స్థలం ఉన్న భూ యజమానిని తమ సొసైటీలో సభ్యుడిగా చూపించి, సదరు వ్యక్తి స్థలాన్ని ప్లే గ్రౌండ్ గా చూపిస్తుండటం ప్రైవేట్ కళాశాలల తెలివి తేటలకు నిదర్శనం. ఇవన్నీ అధికారులకు తెలిసినా అనుమతులు ఇచ్చేస్తున్నారు.

ఒక కళాశాల స్థాపించాలి అంటే ప్రాథమికంగా 8 వేల చదరపు అడుగుల స్లాబ్ ఏరియాతో పాటు పురపాలక, కార్పొరేషన్, ఆర్‌అండ్‌బీ, పోలీసు అధికారుల అనుమతులు అవసరం. ఆ తర్వాత ఇంటర్మీడియట్ బోర్డుకు రూ.4 లక్షలు ఫిక్స్ డిపాజిట్‌గా చూపించాలి. అగ్నిమాపక శాఖ అనుమతులు తప్పనిసరిగా పొందాలి. ఈ శాఖ అనుమతులు పొందాలంటే సాధారణ విషయం కాదు. అగ్ని ప్రమాద విపత్తు సంభవించినప్పుడు నివారించే పరికరాలను, పైప్ లైన్‌ను కచ్చితంగా ఏర్పాటు చేయాలి. ఫైర్ ఎక్స్‌టింగ్విషర్ సిలిండర్లు కచ్చితంగా ఉండాలి. ఇవన్నీ ఉన్నప్పటికీ అనుమతులకు భారీగా అగ్నిమాపక శాఖకు ముడుపులు ఇచ్చుకోవాలి. ఇలా రెండు కళాశాలలు ఏర్పాటు చేస్తే ఇవే నిబంధనలు వర్తిస్తాయి. అయితే ఇవన్నీ వ్యయంతో కూడుకున్నవి కాబట్టి ఒక కళాశాలకు అనుమతులు తీసుకుని వేరొక చోట ఇదే పేరుతో ఇంకో కళాశాల ఏర్పాటు చేసి సొమ్ము మిగుల్చుకుంటున్నారు. అలాగే అమాయక తల్లిదండ్రులను బురిడీ కొట్టించి లక్షల కొద్ది ఫీజులు వసూళ్లు చేస్తున్నారు.

జిల్లా సమాచారం

జిల్లాలో అధికారికంగా ప్రైవేట్ జూనియర్ కళాశాలు	64
ప్రైవేట్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు	75,897
అనధికారికంగా నిర్వహిస్తున్న కళాశాలలు దాదాపు	15
అనధికారిక కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు సుమారు	15,789

మామూళ్లు ముట్టజెప్పి అనుమతులు పొందేసి..

విశాలంగా, గాలి వెలుతురు ధారాళంగా వచ్చేలా తరగతి గదులు ఉండాలి. కానీ జనవాసాల మధ్య ఇరుకైన అపార్ట్‌మెంట్‌లనే తరగతి గదులుగా చూపిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని మురుగానపల్లిలో అపార్ట్‌మెంట్‌లలో నిర్వహించే కళాశాలలు కో కొల్లలుగా పుట్టుకొస్తున్నాయి. ఇంటర్మీడియట్ బోర్డు నుంచి ఒక జూనియర్ కళాశాల అనుమతి పొందాలంటే 8 వేల చదరపు అడుగులు స్లాబ్ ఏరియా కచ్చితంగా ఉండాలి. అలాంటి నిర్మాణానికి అనుమతి ఉండాలంటే స్థానిక పాలన నియమాల ప్రకారం సెట్ బ్యాక్ కింద కాంపౌండ్ వాల్, ఫ్రంట్ స్పేస్, వెంటిలేషన్ కింద స్థలం వదలాల్సి ఉంటుంది. విద్యార్థులకు, అధ్యాపకులకు పార్కింగ్ స్థలం చూపాలి. వీటన్నింటికి మించి ఫైర్ ఇంజిన్ కళాశాల చుట్టూ తిరిగి ప్రమాదాన్ని నివారించే వెసులుబాటు ఉండాలి. ఇలాంటి నిబంధనలు కేవలం మొక్కుబడిగా చూపిస్తూ అమ్యామ్యాలు ఇచ్చి అనుమతులు పొందుతున్నారు.

ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు..




అనుమతులు లేని జూనియర్ కళాశాలల పై ఇంటర్మీడియట్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేయడం జరిగింది. అయితే ఆ అధికారులు ఏ మాత్రం చర్యలు చేపట్టడం లేదు. ఇందులో పలు అనుమానాలకు తావిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా నిబంధనలకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న ప్రైవేట్ జూనియర్ కళాశాలలు అనేకంగా ఉన్నాయి. అనుమతి ఒక చోట పొంది.. మరొక చోట నిర్వహిస్తున్న కళాశాలలు, ఒకే కళాశాలకు అనుమతి పొంది రెండు, మూడు నిర్వహిస్తున్నవి చాలా ఉన్నాయి. ఇంటర్మీడియట్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి చర్యలు చేపట్టాలి. – సద్దాం, స్టూడెంట్స్ జేఏసీ చైర్మన్, చిత్తూరు జిల్లా

345 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

బంగారుపాళెం : చిత్తూరు నుంచి బెంగళూరుకు అక్రమంగా తరలిస్తున్న 345 బస్తాల రేషన్ బియ్యాన్ని సీజ్ చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. సమాచారం మేరకు డీటీ బాబు, తమ సిబ్బందితో కలిసి మొగిలి ఘాట్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో రెండు వాహనాల్లో (ఐచర్, 407 వాహనాలు)అక్రమంగా తరలిస్తున్న 345 బస్తాల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నామని వెల్లడించారు. గంగవరానికి చెందిన భానుమూర్తి, పలమనేరు పట్టణం గంటావూరుకు చెందిన రోషన్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు. బియ్యం విలువ రూ.1.42 లక్షలు వుంటుందని తెలిపారు. బియ్యాన్ని బంగారుపాళెం ఎఫ్‌సీ గోడౌన్‌కు తరలించినట్లు తెలిపారు.

ఎక్సైజ్ కుర్చీకి ఎసరు?

- మద్యం బార్‌లకు దరఖాస్తులు రాకపోతే వేటు !
- కలవర పెట్టిస్తున్న .. ఇతర జిల్లాల బదిలీలు
- 14తో గడువు ముగియనున్న బార్ దరఖాస్తులు
- ఆరు బార్లకు ఒక్క దరఖాస్తు వస్తే ఒట్టు



చిత్తూరు అర్బన్ : జిల్లాలో మద్యం బార్ల వ్యవహారం ఎక్సైజ్‌శాఖలో ఓ అధికారి కుర్చీకి ఎసరు తెచ్చిపెట్టనుందా? నిర్ణీత గడువులోపు బార్లకు దరఖాస్తులు రాకుంటే ఆ అధికారిపై బదిలీ వేటు తప్పదా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. మద్యం బార్లకు దరఖాస్తులు కూడా వేయించని వాళ్లు, ఏం పనిచేస్తారని ఇప్పటికే రెండు జిల్లాల్లోని ఎక్సైజ్ అధికారులపై బదిలీ వేటు పడటం ఇక్కడి అధికారులను కలవరానికి గురిచేస్తోంది.

రెండు రోజులే గడువు

జిల్లాలో 12 మద్యం బార్లకు గతనెల నోటిఫికేషన్ ఇవ్వగా.. ఇందులో చిత్తూరులో 8, కుప్పం, నగరి, పుంగనూరు, పలమనేరు మున్సిపాలిటీల్లో ఒక్కో మద్యం బారు ఏర్పాటు చేయాలని నోటిఫై చేశారు. కుప్పం, పుంగనూరు, నగరితో పాటు చిత్తూరులో మూడు (ఒకటి గీత సామాజిక వర్గాలకు) బార్లకు దరఖాస్తులు రావడంతో లైసెన్సులు కేటాయించారు. పలమనేరు, చిత్తూరులోని మరో అయిదు బార్లకు దరఖాస్తులు రాకపోవడంతో వీటికి రీ–నోటిఫికేషన్ విడుదల చేశారు. వాస్తవానికి చిత్తూరు నగరంలో మెజారిటీ మద్యం బార్లు కూటమి నేతల చేతుల్లోనే ఉండేది. ప్రభుత్వం సూచించిన లైసెన్సు ఫీజులు, నాలుగు దరఖాస్తులు తప్పనిసరి అనే నిబంధనలు నచ్చకపోవడంతో నిర్వాహకులు గతంలో సిండికేట్‌గా ఏర్పడ్డట్లు తెలుస్తోంది. అందరూ మాట్లాడుకుని అయిదు బార్లకు దరఖాస్తులు వేయలేదని సమాచారం. ఈనెల 14వ తేదీ సాయంత్రంలోపు ఆరు బార్లకు దరఖాస్తు చేసుకోవడానికి గడువుగా నిర్ణయించారు.

దరఖాస్తులు రాకపోతే..

మద్యం బార్‌కు దరఖాస్తులు కూడా వేయించలేని అధికారులు, పనిచేయడం దండగ అనే కోణంలో బాపట్ల, కోనసీమ జిల్లాల్లోని ఇద్దరు ఎక్సైజ్ జిల్లా అధికారులపై బదిలీ వేటు వేశారు. ప్రస్తుతం చిత్తూరు జిల్లాలోనూ ఇదే భయం పట్టుకుంది. నాటు సారా నిర్మూలన, నవోదయం 2.0తో పాటు మద్యం దుకాణాల టెండర్లు, అధికారులకు ప్రొటోకాల్స్ అన్నీ దగ్గరుండి చూసుకుంటే ఇప్పుడు మెడపై కత్తి పెట్టి మద్యం బార్ల అంశాన్ని తీసుకొచ్చారని అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బార్‌లకు దరఖాస్తులు రాకుంటే బదిలీ వేటు తప్పదనే నేపథ్యంలో అధికారుల బాధలు వర్ణనాతీతంగా మారాయి. పనితీరు బాగోలేకుంటే బదిలీ చేయొచ్చు. ప్రభుత్వ పాలసీ నచ్చకుండా నిర్వాహకులు ముందుకు రాకుంటే తమను బలి పశువు చేయడం ఎంత వరకు సమంజసమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

దళిత ద్రోహి చంద్రబాబు

- దళిత మహిళలపై అత్యాచారాలు జరుగుతుంటే పవన్‌కల్యాణ్‌కు పట్టదా?
- జగనన్నను సీఎం చేసుకోవడమే లక్ష్యం
- కేసులకు భయపడకుండా కూటమి ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎండగడదాం
- వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్‌బాబు



మాట్లాడుతున్న కళత్తూరు నారాయణస్వామి

తిరుపతి మంగళం: దళిత ఓట్లతో అధికారంలోకి వచ్చి దళితుల్లో ఎవరైనా పుట్టాలనుకుంటారా? అని దళితులను హేళనగా మాట్లాడిన దళిత ద్రోహి చంద్రబాబు అని వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు టీజేఆర్ సుధాకర్‌బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుపతి పద్మావతిపురంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం పార్టీ ఎస్సీ విభాగం ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు తలారి రాజేంద్ర ఆధ్వర్యంలో పార్టీ ఎస్సీ విభాగం ఉమ్మడి చిత్తూరు జిల్లా ఎస్సీ విభాగం నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా టీజేఆర్ సుధాకర్‌బాబు, చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామి, పార్టీ ఎస్సీ విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కనకారావుతో పాటు ఎమ్మెల్సీ భరత్, మాజీ ఎమ్మెల్యేలు సునీల్‌కుమార్, లలితా థామస్, నియోజకవర్గాల సమన్వయకర్తలు భూమన అభినయ్‌రెడ్డి, నూకతోటి రాజేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుధాకర్‌బాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దళితులపై దాడులు, దళిత మహిళలపై అత్యాచారాలు అధికమయ్యాయన్నారు. ఎన్నికల ముందు మహిళలకు అండగా ఉంటా మహిళల జోలికి వస్తే తాటతీస్తానంటూ ప్రగల్భాలు పలికిన పవన్‌కల్యాణ్‌కు దళిత మహిళ ఆత్యాచారాలు కనపడడం లేదా? అని ప్రశ్నించారు. దళితుల పట్ల చిన్నచూపు చూస్తున్న కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి దళితులంతా ఏకమవుదామని పిలుపునిచ్చారు. సమాజంలో దళితులకు ఉన్నత స్థానాన్ని, ఉన్నత పదవులను కల్పించిన ఏకైక నాయకుడు జగనన్న మాత్రమేనని.. అలాంటి గొప్ప నాయకున్ని తిరిగి ముఖ్యమంత్రిగా చేసుకుందామన్నారు. అనంతరం మాజీ డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో జగనన్నను ముఖ్యమంత్రి చేసుకోవడానికి సైనికుల్లా పని చేద్దామన్నారు. అనంతరం భూమన కరుణాకరరెడ్డి మాట్లాడుతూ ఎనభై ఏళ్ల క్రితమే దళిత కుటుంబంతో వివాహ బంధం ఏర్పరుచుకుని దళితులతో బాంధవ్యాన్ని కలుపుకున్న కుటుంబం వైఎస్ రాజశేఖరరెడ్డి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిది అని గుర్తు చేశారు. అనంతరం భూమన అభినయ్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో బడుగు, బలహీన వర్గాలకు రూ.2.80 లక్షల కోట్లను సంక్షేమ పథకాల రూపంలో అందించిన గొప్ప నాయకుడు జగనన్న అన్నారు. నియోజకవర్గాల సమన్వయకర్తలు సునీల్‌కుమార్, నూకతోటి రాజేష్ మాట్లాడుతూ జగనన్న అధికారంలో ఉంటే బడుగు, బలహీన వర్గాల జీవితాల్లో వెలుగులు ఉంటాయన్నారు. సమావేశంలో పార్టీ ఎస్సీ విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆరే అజయ్‌కుమార్, అనంతపురం జిల్లా ఇన్‌చార్జ్ నల్లాని బాబు, కార్పొరేటర్లు కోటూరు ఆంజినేయులు, బోకం అనిల్ కుమార్, పునీతమ్మ, ఎస్సీ విభాగం నగర అధ్యక్షుడు చేజర్ల మురళి, ఉమ్మడి చిత్తూరు జిల్లా ఎస్సీ విభాగం నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

కల్పవృక్షంపై వరసిద్ధుడు



కల్పవృక్షవాహనంపై విహరిస్తున్న వరసిద్ధి వినాయకస్వామి

కాణిపాకం : కల్పవృక్ష వాహనసేవ నేత్రానందంగా జరిగింది. నిత్యపూజలతో శ్రీ సిద్ధి, బుద్ధి సమేత వినాయకస్వామి కల్పవృక్ష సేవలో గురువారం భక్తులకు కనువిందు చేస్తూ మాడ వీధుల్లో వైభవంగా విహరించారు. కాణిపాకంలోని శ్రీ వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో ప్రత్యేక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ప్రత్యేక బ్రహ్మోత్సవాల్లో భాగంగా కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో శుక్రవారం విమానోత్సవం నిర్వహించనున్నట్లు ఈఓ పెంచల కిషోర్ తెలిపారు.

క్లుప్తంగా

గజరాజుల బీభత్సం

పులిచెర్ల(కల్లూరు) : మండలంలోని ఆవుల పెద్దిరెడ్డిగారిపల్లె, కురవపల్లె, గొరిశెట్టిగారి పల్లెల్లో గురువారం తెల్లవారుజామున ఏనుగుల గుంపు పంట పొలాలపై దాడి బీభత్సం సృష్టించాయి. వరుస దాడులతో రైతులు బెంబేలెత్తిపోతున్నారు. ఆవుల పెద్దిరెడ్డిగారి పల్లెలో రైతు వీరయ్య పొలంలో వరి పంటను ధ్వంసం చేశాయి. అలాగే మిగిలిన ప్రాంతాల్లో టమోటా, అరటి, కొబ్బరి చెట్లను తొక్కి నాశనం చేశాయి. అటవీశాఖ అధికారులు ఏనుగులను పొలాల్లోకి రాకుండా కట్టడి చేయాలని రైతులు కోరుతున్నారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో అశ్విక (32) అనే వివాహిత గురువారం అనుమానాస్పదంగా మృతి చెందారు. వన్‌టౌన్ సీఐ మహేశ్వర కథనం.. గుడిపాలలోని 190-రామాపురానికి చెందిన అశ్విక, గంగాధరనెల్లూరుకు చెందిన అరుణ్‌కుమార్‌కు పదేళ్ల క్రితం పెద్దల సమక్షంలో పెళ్లయ్యింది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. పిల్లల చదువురీత్యా దంపతులు ఇద్దరూ చిత్తూరులోని మిట్టూరులో నివాసముంటున్నారు. బుధవారం రాత్రి ఒకే గదిలో పడుకున్న దంపతులు.. తెల్లవారి చూసేసరికి పడకపై అశ్విక అచేతనంగా పడి ఉంది. ఆమె చనిపోయిందని తెలుసుకున్న భర్త గంగాధరనెల్లూరులోని ఆరిమాకులపల్లెకు మృతదేహాన్ని తీసుకెళ్లాడు. తన కుమార్తె మృతిపై అనుమానం ఉందని, మృతురాలి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించి, దర్యాప్తు చేస్తున్నారు.

'అఖిల దేవతా కృతి' పాట ఆవిష్కరణ


పాటను ఆవిష్కరిస్తున్న ఈఓ పెంచలకిషోర్

కాణిపాకం: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో గురువారం పలమనేరుకు చెందిన వాసుదేవన్ రచించిన అఖిల దేవతా కృతి అనే పాటను ఆవిష్కరించారు. ఈఓ పెంచల కిషోర్ చేతుల మీదుగా పాటను ఆవిష్కరించగా పలువురు వాసుదేవన్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఏఈఓ ధనపాల్, సినీ గాయకుడు గజల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

వేవేల దండాలు తల్లీ..

పోలేరమ్మా

అమ్మా.. పోలేరూ తల్లీ.. కరుణించమ్మా.. కాపాడరావమ్మ పోలేరమ్మా అంటూ భక్తుల జయజయధ్వానాల నడుమ జాతర ముగిసింది. అయితే ఈ ఏడాది జాతర సంప్రదాయాలకు కూటమి నేతలు స్వస్తి పలికారు. అంతటా వారి పెత్తనమే ఎక్కువగా కనిపించింది. జాతర వేళ రెండు రోజుల పాటు పూర్తిగా మద్యం అమ్మకాలను నిలిపివేయడం మొదటి నుంచి వస్తున్న ఆనవాయితీ. అయితే 48 గంటల పాటు కాకుండా కేవలం 24 గంటలు మాత్రమే నిషేధించారు. ఆపై మద్యం ఏరులై పారింది. రాజాలకు కనీస మర్యాదలు కూడా ఇవ్వకుండా కూటమి నేతలు అడుగడుగునా అడ్డు తగిలారు. మరోవైపు తాగునీటి కోసం భక్తులు తీవ్ర ఇబ్బంది పడ్డారు.

- జైపోలేరు.. జైజై పోలేరంటూ మార్మోగిన వెంకటగిరి
- జన జాతరకు లక్షలాది మంది రాక
- నిబంధనలకు స్వస్తి.. ఏరులైన పారిన మద్యం
- రాజాలకు అవమానం
- కూటమి నేతల కోసం ప్రత్యేక క్యూ
- ముగిసిన పోలేరమ్మ జాతర

వెంకటగిరి(సైదాపురం) : కోరిన కోర్కెలు తీర్చే తల్లీ..పోలేరమ్మా.. కాపాడగరావమ్మా.. అంటూ భక్తజనం పోలేరమ్మ ఎదుట ప్రణమిల్లారు. జాతర సందర్భంగా వెంకటగిరి పురవీధులన్నీ స్వర్ణకాంతులతో దేదీప్యమానంగా కాంతులీనాయి. అమ్మవారి


భక్తులతో కిక్కిరిసిన వెంకటగిరి వీధులు

ప్రతిరూపాన్ని తనివితీరా దర్శించుకున్న భక్తులు పులకించారు. అమ్మలుగన్న అమ్మా.. పోలేరమ్మా తల్లీ అంటూ పట్టణ పురవీధుల్లో ప్రతిధ్వనించాయి. వెంకటగిరి పట్టణమంతా జైపోలేరూ.. జైజై పోలేరూ తల్లీ అంటూ మార్మోగింది. జిల్లా నలుమూలలే కాకుండా దేశవిదేశాల నుంచి కూడా పోలేరమ్మ జాతరకు విచ్చేయడంతో దారులన్నీ వెంకటగిరివైపే మళ్లాయి. దీంతో ఎక్కడ చూసినా జనమే దర్శనమిచ్చారు.

సారె సమర్పణ..

వెంకటగిరి రాజా కుటుంబీకుల సర్వజ్ఞకుమార కృష్ణ యాచేంద్రతోపాటు పలువురు అమ్మవారికి సంప్రదాయబద్ధంగా సారెను సమర్పించారు. ఆలయ మహద్వారం నుంచి పసుపు కుంకుమ, గాజులు, పట్టువస్త్రాలతో కూడిన సారెను అందించారు. అంతకుముందు నెల్లూరు జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, వైఎస్సార్‌సీపీ నేత బొలిగర్ల మస్తాన్ యాదవ్, వైఎస్సార్‌సీపీ నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు.

జాతరకు భద్రత..

పోలేరమ్మ జాతర రాష్ట్ర పండుగ కావడంతో కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, ఎమ్మెల్యే

జాతరలో ప్రత్యేకతలు

- రాష్ట్ర పండుగగా రెండురోజుల పాటు జరిగిన పోలేరమ్మ జాతర గురువారం సాయంత్రం అమ్మవారి నిమ్రజ్జనంతో వైభవంగా ముగిసింది.
- సుమారు 2 లక్షలకు పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.
- ప్రత్యేకంగా ఏర్పాట్లు చేసిన క్యూలైన్లు భక్తులతో కిక్కిరిశాయి.

కురుగొండ్ల రామకృష్ణతో పాటు అధికారులు జాతర ఏర్పాట్లను పర్యవేక్షించారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఉండేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. అయితే అనుకున్న మేర ఏర్పాట్లు చేయకపోవడంతో భక్తుల నుంచి విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

ఆనందోత్సాహాల నడుమ నగరోత్సవం..

భక్తజన సందోహం నడుమ నగరోత్సవం ప్రారంభం కాగా భక్తులు పెద్దఎత్తున వీక్షించారు. బుధవారం అర్ధరాత్రి అమ్మవారి మెట్టునిల్లు అయిన జీనుగులవారి వీధి నుంచి వేకువజామున నాలుగు గంటలకు అమ్మవారిని ఊరేగింపుగా తీసు


పోలీసు బందోబస్తు

కువచ్చి ఆలయం వద్ద ప్రత్యేకంగా నిర్మించిన మండపంలో అధిష్టించారు. తెల్లవారుజాము నుంచే భక్తులను దర్శనానికి అనుమతించారు. అయితే భక్తులకు నామమాత్రంగా ఓ గంట పాటు వాటర్, మజ్జిగ ప్యాకెట్లను అందజేశారు. ఉచిత దర్శనం, రూ.100, రూ.300 టికెట్లను కొనుగోలు చేసిన భక్తుల కోసం పాతబస్టాండ్ మీదుగా కొత్తగా క్యూలైన్‌ను పొడిగించారు. అమ్మవారి సాంగెం పోలీసు బందోబస్తు నడుమ రాజా భవనం నుంచి అమ్మవారి ఆలయం వద్ద తీసుకురావాల్సి ఉండగా అవేవీ లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఈ ఏడాది కూటమి నేతల కనుసన్నల్లో జాతర జరిగింది. గతంలో ఉన్న వీఐపీ క్యూలైన్ పూర్తిగా ఎత్తేసి ప్రోటోకాల్ ఉన్నవారికి మాత్రమే ప్రత్యేక దర్శనమని ప్రకటించారు. కానీ అదంతా కేవలం ప్రకటనలకే పరిమితమైంది.

దున్నపోతు బలితో..

జాతర సంప్రదాయ ప్రకారం అమ్మవారికి దున్నపోతు బలి కార్యక్రమం జరిగింది. అమ్మవారి నిమజ్జనం పూర్తయ్యే వరకు గండదీపం ఆరిపోకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. బలి పూర్తి కాగానే గ్రామ పొలిమేరల్లో నాలుగుదిక్కులా పొలి చల్లారు.


ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ తల్లి

పట్టువస్త్రాల సమర్పణ

జాతర సందర్భంగా దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అమ్మవారికి సంప్రదాయబద్ధంగా మేళతాళలతో పట్టువస్త్రాలను సమర్పించారు. దేవదాయ కమిషనర్ రామచంద్రయ్య, ఆలయ ఈఓ శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. అనంతరం వేదపండితులు ఆశీర్వచనం అందజేశారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, కోవూరు ఎమ్మెల్యేలు వేమిరెడ్డి ప్రశాంతి, చైర్మన్ నక్కా భానుప్రియ హాజరయ్యారు.

మామిడి రైతులకు రూ.8 చెల్లించాల్సిందే !

- 15న కలెక్టరేట్‌కు మహార్యాలీ
- మామిడి రైతులు హాజరు కావాలని పిలుపు

గంగాధర నెల్లూరు : రాష్ట్ర ప్రభుత్వం మామిడి రైతులకు చెప్పిన మాట ప్రకారం కొనుగోలు ధర 8 రూపాయలు చెల్లించాల్సిందేనని ఉమ్మడి చిత్తూరు జిల్లా మామిడి రైతుల సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గంగాధర నెల్లూరు మండల కేంద్రంలో గురువారం ఉమ్మడి చిత్తూరు జిల్లా మామిడి రైతుల సంక్షేమ సంఘం నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మూడు జిల్లాల కలెక్టర్లు రైతులు, సంఘాల నాయకులు పరిశ్రమ యజమానులు సమావేశం ఏర్పాటు చేసి తోతాపూరి ధర 12


సమావేశమైన ఉమ్మడి చిత్తూరు జిల్లా మామిడి రైతు సంక్షేమ సంఘం నాయకులు

రూపాయలుగా నిర్ణయించగా ప్రస్తుతం ఫ్యాక్టరీ యాజమాన్యాలు నాలుగు, ఐదు రూపాయలే చెల్లిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం నిర్ణయించిన కొనుగోలు ధర 8 రూపాయలు, సబ్సిడీ ధర 4 రూపాయలను వెంటనే రైతులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతు పరిశ్రమల ముందు మామిడి రైతులు బిచ్చగాళ్లలాగా పడిగాపులు కాస్తున్నా పట్టించుకోకపోవడంపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. ఈనెల 15వ తేదీన ఉమ్మడి చిత్తూరు జిల్లా మామిడి రైతుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చిత్తూరు మ్యాంగో యార్డు నుంచి కలెక్టరేట్ వరకు మామిడి రైతుల ట్రాక్టర్ వాహన మహా ర్యాలీలో రైతులు పాల్గొని కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించే కార్యక్రమం జయప్రదం చేయాలని కోరారు. చిత్తూరు జిల్లా వ్యాప్తంగా మామిడి రైతులు పెద్ద ఎత్తున కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో మామిడి రైతుల సంక్షేమ గౌరవాధ్యక్షుడు జయరాం రెడ్డి, అధ్యక్షుడు త్యాగరాజ రెడ్డి, రైతు నాయకులు వెంకటేశులు ప్రభాకర్ , పురుషోత్తం, గుణశేఖర్ రెడ్డి, ప్రకాష్ , చిట్టిబాబు మామిడి రైతులు పాల్గొన్నారు.

ఎర్రమట్టి రవాణాలో తమ్ముళ్ల కుమ్ములాట

పాలసముద్రం : గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే థామస్, టీడీపీ రాష్ట్ర నాయకుడు చిట్టిబాబునాయుడు మధ్య పచ్చి గడ్డివేస్తే భగ్గుమంటోందని కొంత మంది టీడీపీ నాయకులే చెప్పుకుంటున్నారు. ఇలా వారిద్దరి మధ్య విభేదాలు జరుగుతున్న సమయంలో ఎమ్మెల్యే వర్గానికి చెందిన కొందరు టీడీపీ నేతలు ఎర్రమట్టి గ్రావెల్ క్వారీలో అక్రమంగా తమిళనాడుకు తలిస్తున్నారు. వీటిని అడ్డుకట్ట వేసేందుకు చిట్టిబాబు నాయుడు జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. అయినా అక్రమ ఎర్రమట్టి గ్రావెల్ తమిళనాడుకు తరలిపోతూనే ఉంది. అధికారులు కూడా ఎర్రమట్టి గ్రావెల్ ఆపితే ఎమ్మెల్యే ఏమంటారోనని.. ఆపకపోతే రాష్ట్ర టీడీపీ నేత చిట్టిబాబు నాయుడు జిల్లా స్థాయి అధికారులకు ఫిర్యాదు చేస్తారని భయాందోళన చెందుతున్నారు. ఇలా ఎమ్మెల్యే వర్గం.. రాష్ట్ర టీడీపీ నేత చిట్టిబాబు వర్గం ఎర్రమట్టి రవాణాలో ఎవ్వరికి వారే యమునా తీరేలా వ్యవహరిస్తున్నారు.


టిప్పరులో తమిళనాడుకు తరలిపోతున్న ఎర్రమట్టి గ్రావెల్

సూపర్ సిక్స్ సభ అట్టర్ ఫ్లాప్


మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

పాలసముద్రం : అనంతపురంలో కూటమి ప్రభుత్వం నిర్వహించిన సూపర్ సిక్స్ సభ అట్టర్ ఫ్లాప్ అయిందని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సభకు ఆశించిన స్థాయిలో ప్రజా స్పందన లేదన్నారు. సభ విజయవంతం కాకపోవడంతో కూటమి నాయకులు షాక్‌కు గురయ్యారని పేర్కొన్నారు. సూపర్ సిక్స్ సభకు బలవంతంగా జన సమీకరణ చేశారన్నారు. ప్రతి మహిళా సంఘం నుంచి ఐదుగురు సభ్యులు ఈ సభకు రావాలని అధికారులు ఒత్తిడి చేయడంతో మహిళలు తప్పని పరిస్థితిలో సభకు వెళ్లారని పేర్కొన్నారు. సూపర్ సిక్స్ పథకాలన్నీ అమలు చేయకుండానే సూపర్‌హిట్ సభ నిర్వహించడం రాష్ట్ర ప్రజలను మోసం చేయడమేనని విమర్శించారు. నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి పథకాలను కూటమి ప్రభుత్వం అమలు చేసినట్లు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. జనసేన, బీజేపీ, టీడీపీ కలిసి సభను నిర్వహించినా ప్రజల్లో స్పందన కరువైందన్నారు. బలవంతపు విజయోత్సవాలు చేసుకోవడం దేశంలోనే చంద్రబాబుకు మాత్రమే సాధ్యమేని విమర్శించారు. గంగాధర నెల్లూరు నియోజకవర్గంలోని గుట్టలో ఎర్రమట్టి తమిళనాడుకు తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదని ధ్వజమెత్తారు. ఎన్నడు లేని విధంగా గుట్టలు మాయమవుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

25 లోపు మామిడి రైతుల ఖాతాల్లో సబ్సిడీ


కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా మామిడి సబ్సిడీ నగదును ఈ నెల 20 నుంచి 25వ తేదీ లోపు సంబంధిత మామిడి రైతుల ఖాతాల్లో జమ చేస్తామని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ వెల్లడించారు. ఈ మేరకు ఆయన కలెక్టరేట్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. జిల్లాలో మామిడి సీజన్‌లో 4.1 లక్షల మెట్రిక్ టన్నులు సరఫరా చేసిన 37 వేల మంది రైతులకు సబ్సిడీని జమచేయనున్నట్లు తెలిపారు. రైతుల ఖాతాల్లో రూ.160 కోట్ల మేర జమచేస్తామన్నారు. గత కొద్ది రోజులుగా అర్హుల నివేదికలను పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం తరఫున రైతులకు కిలోకు రూ.4 చొప్పున సబ్సిడీ రాయితీ అందజేస్తోందన్నారు. ఒక్కొక్క రైతుకు రాయితీ రూపంలో దాదాపు రూ.40 వేలు జమవుతుందని తెలిపారు. మామిడి పరిశ్రమల ఆధ్వర్యంలో 2.35 లక్షల మెట్రిక్ టన్నులు, ర్యాంపులు, మండీల నుంచి 1.65 లక్షల మెట్రిక్ టన్నుల మామిడి కొనుగోలు జరిగినట్లు పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో మామిడిసాగుకు రూ.10 కోట్లు ఖర్చు చేశామన్నారు. త్వరలో కృష్ణగిరి నుంచి రెండు కొత్త పరిశ్రమలు జిల్లాలో ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. వెదురుకుప్పం మండలంలో విధుల పట్ల అలసత్వం వహించిన ఇద్దరు వీఆర్వోలను ఇటీవల సస్పెండ్ చేశామన్నారు.

పేకాట ఆడుతున్న 24 మంది అరెస్టు

- పట్టుబడ్డ వారిలో కూటమి పార్టీ నేతలే అధికం

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో పేకాట ఆడుతున్న 24 మందిని పోలీసులు గురువారం అరెస్టు చేశారు. టూటౌన్ సీఐ నెట్టికంటయ్య కథనం మేరకు.. గంగనపల్లెలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో సీఐ నెట్టికంటయ్య తన సిబ్బందితో వెళ్లి దాడులు చేశారు. ఇక్కడ పేకాట ఆడుతున్న కెఎస్.మధు (57), పి.జగదీష్ (39), ఎంజి.ఆనంద్‌బాబు (38), ఐ.రియాజ్ భాష (40), పికె.ఆసీఫ్ (29), ఎండి.షరీఫ్ (33), ఎస్.హసీఫ్ (30), ఎం.లోకేష్ (37), డి.ధనుష్ (21), జె.ఉమాపతి (28), ఆర్.మణికంఠ (29), కె.మోహన్ బాబు (36), ఎంఆర్.జయప్రకాష్ (51), వి.ఏలుమలై (52), పి.సదాశివ (58), కె.శివ (47), పి.బషీర్ (52), పి.స్వాతికిరణ్ (43), ఎన్.జ్యోతీశ్వరన్ (44), ఎ.రాజ్‌కుట్టి (35), ఎస్.రాజా (36), జి.షాన్వాజ్ (40), ఎస్‌కె.మున్నా (40)ను అరెస్టు చేసి, ఆపై 41 నోటీసులు ఇచ్చి విడుదల చేశారు. నిందితుల వద్ద రూ.37,160 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. కాగా పోలీసులకు చిక్కిన నిందితుల్లో కూటమి పార్టీకి చెందిన పలువురు కార్యకర్తలు, నియోజకవర్గ స్థాయి పదవుల్లోని వాళ్లు ఉన్నారు.

విద్యాలయంలో మందుబాబుల ఆగడాలు


పాఠశాల ఆవరణలో పడి ఉన్న మందుబాటిళ్లు

చిత్తూరు కలెక్టరేట్ : నగరంలోని వన్నియర్ బ్లాక్‌లో ఉన్న మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో మందుబాబుల ఆగడాలు శ్రుతిమించుతున్నాయి. విద్యాలయంలో రాత్రి సమయాల్లో మందుబాబులు మద్యం సేవించి బాటిళ్లను పాఠశాల ఆవరణలో పడేస్తున్నారు. అదే విధంగా ఆ పాఠశాలలో ఉండే ఓవర్ హెడ్ ట్యాంక్ నిచ్చెన మెట్లు మరమ్మతులకు లోనుకావడంతో ప్రమాదకరంగా మారింది. చిన్నారులు భయాందోళన చెందుతున్నారు. పాఠశాల వద్ద రాత్రి సమయాల్లో పోలీసుల గస్తీ పెంచి వాచ్‌మన్‌ను ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.


మరమ్మతులకు లోనైన ఓవర్ హెడ్ ట్యాంక్ మెట్లు

ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి


మృతి చెందిన శ్రీనివాసులు

వి.కోట: బైక్ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని వి.కోట -పెర్నంబట్ జాతీయ రహదారిలోని ఏడుచుట్లకొట్ల గ్రామం వద్ద గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసుల కథనం.. మండలంలోని చింతమాకుల పల్లి గ్రామానికి చెందిన చిన్న బిడ్డప్ప కుమారుడు శ్రీనివాసులు(65) కూలి పనులు ముగించుకుని ఏడుచుట్ల గ్రామం వద్ద రోడ్డు దాటుతున్నాడు. అదే సమయంలో తమిళనాడు రాష్ట్రం వేలూరుకు చెందిన వ్యక్తి బైక్‌పై వి.కోట నుంచి పెర్నంబట్టు వైపు వెళ్తున్న శ్రీనివాసులును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో శ్రీనివాసులు తలకు బలమైన గాయాలయ్యాయి. హుటాహుటిన స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. శ్రీనివాసులు అప్పటికే మృతిచెందిన్నట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు సీఐ సోమశేఖర్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. కాగా మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

వైభవంగా కలశ ఊరేగింపు


ప్రత్యేక డప్పు కళాకారుల ప్రదర్శన


విచిత్ర వేషధారణలో కళాకారులు

కాణిపాకం : వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా కల్పవృక్షవాహన సేవను పురస్కరించుకుని కాణిపాకంలోని దేవస్థానం సిబ్బంది, అర్చకులు, వేద పండితుల ఆధ్వర్యంలో గురువారం కలశంతో భారీ ఊరేగింపు నిర్వహించారు. శివాలయం నుంచి 501 కలశాలతో పురవీధుల్లో కోలాటలు, కేరళ వాయిద్యం , తప్పెటగుండ్లు నడుమ అత్యంత వైభవంగా కలశాలతో ఊరేగింపు చేశారు. అనంతరం ఆలయానికి చేరుకుని స్వామివారి ఉత్సవమూర్తులకు ప్రత్యేక అభిషేకం చేశారు. కార్యక్రమంలో దేవస్థానం ఈవో పెంచల కిషోర్, ఏఈఓలు ఆలయ అధికారులు, దేవస్థానం సిబ్బంది, అర్చకులు, వేద పండితులు, ఉభయదారులు తదితరులు పాల్గొన్నారు. అలాగే కల్పవృక్షవాహన సేవలో భాగంగా ఆలయాన్ని శోభయామానంగా తీర్చిదిద్దారు.


కలశాలతో ఊరేగింపుగా వస్తున్న భక్తులు